# గుట్టలో ధనుర్మాసోత్సవాలకు శ్రీకారం


యాదగిరిగుట్ట ప్రధానాలయం క్యూలైన్‌లో భక్తుల కోలాహలం

- ప్రధానాలయంలో ప్రారంభమైన ఉత్సవాలు
- 30 రోజులపాటు సాగనున్న పూజలు
- పాతగుట్ట ఆలయంలో వైభవంగా ఏకకుండాత్మక మహాసుదర్శన నారసింహ హోమం
- ఆలయానికి పోటెత్తిన భక్తులు

యాదగిరిగుట్ట, డిసెంబర్17: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయంలో ధనుర్మాసోత్సవాలకు ప్రధానార్చక బృందం శ్రీకారం చుట్టారు. ఆదివారం తెల్లవారుజామున ప్రధానాలయ మొదటి ప్రాకార మండపంతో గోదాదేవికి ఆరాధన, అష్టోత్తరం చేపట్టి సేవ కాలాన్ని ప్రారంభించారు. పాశురాలను పఠిస్తూ, అమ్మవారికి హారతినిస్తూ శ్రవణం గావించారు. వేద మంత్రాలు పటిస్తూ అమ్మవార్లకు తిరుప్పావై పూజలు చేశారు. ధనుర్మాస విశిష్టత, పాశురాల ప్రాశస్త్యాన్ని భక్తులకు వివరించారు. సూర్యుడు ధనురాశిలో ప్రవేశించడంతో ధనుర్మాసం ప్రారంభమవుతుందని, ఈ మాసంలో భక్తులు ఆలయాలను దర్శించుకుంటే శుభాలు కలుగుతాయని ఆలయ ప్రధానార్చకుడు నల్లన్‌థీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు పేర్కొన్నారు. గోదాదేవి, రంగనాయకుడిపై రచించిన పాశురాలను రోజుకు ఒకటి చొప్పున 30 రోజులపాటు పఠిస్తూ అర్చకులు మార్గళి పూజలు నిర్వహిస్తామని తెలిపారు. జనవరి 14న రాత్రి 7 గంటలకు గోదా కల్యాణం, 15న ఉదయం 11:30 గంటలకు ఒడిబియ్యం కార్యక్రమం చేపట్టి ఉత్సవాలకు ముగింపు పలుకుతామని తెలిపారు. పాతగుట్ట(పూర్వగిరి) లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ఉదయం ఏకకుండాత్మక, పాంచహ్నిక సుదర్శన నారసింహ మహాయాగాన్ని ప్రారంభించారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, మృత్స్యంగ్రహణం, అంకురారోహణతో మహాయాగం సాగింది. ఈ నెల 21వరకు సుదర్శన నారసింహ మహాయాగం కొనసాగుతుందని ఆలయ ఈఓ గీత తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, డీఈఓ భాస్కర్ శర్మ, ఏఈఓ రమేశ్‌బాబు పాల్గొన్నారు.

### యాదగిరిగుట్టలో భక్తుల కోలాహలం

పంచనారసింహుడి క్షేత్రమైన యాదగిరిగుట్టకు భక్తులు పోటెత్తారు. ధనుర్మాసోత్సవం ప్రారంభంతోపాటు ఆదివారం సెలవుదినం కావడంతో నారసింహుడిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. మాఢవీధులు, క్యూ కాంప్లెక్స్, తిరు మాఢవీధులు, గర్భాలయ ముఖ మండపంలో భక్తుల కోలాహలం నెలకొన్నది. కొండపైకి వాహనాల రద్దీ కొనసాగింది. తెల్లవారుజాము నుంచే నారసింహుడిని దర్శించుకున్న భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. నిత్య తిరుకల్యాణోత్సవం, సువర్ణ పుష్పార్చనలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్వామి, తెల్లవారుజామున స్వామివారికి సుప్రభాత సేవ నిర్వహించారు. తిరువారాధన జరిపి ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వామివారికి నిజాభిషేకం, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టారు. స్వామి, అమ్మవార్లకు ఉదయం సుదర్శన నారసింహహోమం నిర్వహించారు. సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ హోమం జరిపారు. అనంతరం మొదటి ప్రాకార మండపంలో స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిపారు. సాయంత్రం వెండి మొక్కు జోడు సేవలు, దర్బార్ సేవలో భక్తులు పాల్గొని తరించారు. పాతగుట్ట ఆలయంలో ఆర్జిత పూజలు నిర్వహించారు. స్వామివారి ధర్మ దర్శానికి 3 గంటలు, వీఐపీ దర్శనానికి రెండున్నర గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. 40 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. ఆలయ ఖజానాకు రూ.54,09,081 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ గీత, అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి తెలిపారు.

## మంత్రి కొండా సురేఖకు లక్ష్మీనృసింహస్వామి ప్రసాదం

యాదగిరిగుట్ట : రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రిగా కొండా సురేఖ ఆదివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో తన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రధానార్చకుడు కాండూరి వేంకటాచార్యులు బృందం మంత్రికి వేద ఆశీర్వచనం చేశారు. ఆలయ అనువంశికధర్మకర్త నరసింహమూర్తి, ఆలయ డీఈఓ దోర్బల భాస్కర్‌శర్మ మంత్రి దంపతులను శాలువాతో ఘనంగా సన్మానించి స్వామివారి మహాప్రసాదాన్ని అందజేశారు.


మంత్రి సురేఖకు స్వామివారి ప్రసాదం అందజేస్తున్న ఆలయ అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి, డీఈఓ భాస్కర్‌శర్మ

# రాష్ట్రపతి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- అధికారులతో సమీక్షలో కలెక్టర్ హనుమంతు కె.జెండగే

భూదాన్‌పోచంపల్లి, డిసెంబర్ 17 : ఈ నెల 20న భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము భూదాన్ పోచంపల్లికి వస్తున్నందున పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే అధికారులను ఆదేశించారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. స్థానిక బాలాజీ ఫంక్షన్ హాల్‌లో సభ ఏర్పాట్లు, టూరిజం సెంటర్, పోలీస్ స్టేషన్ సమీపంలో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ పనులను పర్యవేక్షించారు. అధికారులు దగ్గరుండి పనులను పరిశీలించాలని సూచించారు. భూదానగంగోత్రి ప్రాంగణంలో ఆచార్య వినోబాభావే, భూదాత వెదిరె రామచంద్రారెడ్డి కాంస్య విగ్రహాలు, భూదాన స్థూపం, పర్యాటక కేంద్రంలో భూదానోద్యమానికి సంబంధించిన చిత్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. చేనేత యూనిట్ల స్టాళ్ల ఏర్పాట్లలో వసతులు కల్పించాలని సూచించారు. చారిత్రాత్మకమైన వినోబా మందిరాన్ని రాష్ట్రపతి సందర్శించనున్నారని, పర్యాటక ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. కార్యక్రమంలో రాష్ట్ర చేనేత జౌళి శాఖ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ ఎం.వెంకటేశం, జిల్లా చేనేత జౌళి శాఖ ఏడీ విద్యాసాగర్, అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, హ్యాండ్లూమ్ డైరెక్టర్ అరణ్‌కుమార్, తాసీల్దార్ వీరాబాయి, ఎంపీడీఓ బాలాశంకర్, మున్సిపల్ కమిషనర్ కోమటిరెడ్డి నరసింహారెడ్డి, ఎంఆర్ఐ గుత్తా వెంకట్‌రెడ్డి, మున్సిపల్ సీనియర్ అసిస్టెంట్ రాజేశ్ పాల్గొన్నారు.


భూదాన్ స్థూపం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే, రాష్ట్ర హ్యాండ్లూమ్ డైరెక్టర్ అరుణ్‌కుమార్


బాలాజీ ఫంక్షన్ హాల్‌లో సభాస్థలి ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది


ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొని పూజలు చేస్తున్న జగదీశ్‌రెడ్డి

## ఆంజనేయుడి అనుగ్రహం ప్రతి ఒక్కరికీ కలుగాలి

- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట రూరల్, డిసెంబర్ 17 : ఆంజనేయ స్వామి అనుగ్రహంతో గ్రామం పచ్చగా ఉండాలని, ప్రతి కుటుంబానికి స్వామివారి ఆశీస్సులు ఉండాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆకాంక్షించారు. ఆదివారం మండలంలోని దాస్‌తండాలో ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డికి మహిళలు, వృద్ధులు, చిన్నారులు ఆత్మీయ స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి, జడ్పీటీసీ జీడి భిక్షం, సర్పంచ్ నునావత్ విజయామోతీలాల్, ఉప సర్పంచ్ మెగావత్ బాలు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వంగాల శ్రీనివాస్‌రెడ్డి, రాజా పాల్గొన్నారు.

## జాతీయ ఉత్తమ సహకార బ్యాంక్ అధ్యక్షుడిగా డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట, డిసెంబర్ 17 : సహకార రంగంలో చేసిన విశేష కృషికిగానూ నల్లగొండ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి జాతీయ ఉత్తమ సహకార బ్యాంక్ అధ్యక్షుడిగా ఎంపికయ్యారు. ఇంటలెక్చువల్ పీపుల్స్ ఫౌండేషన్ న్యూఢిల్లీ వారు సహకార రంగంలో ఉత్తమ సేవలు అందించిన అధ్యక్షుల నుంచి నామినేషన్ తీసుకోగా, వారిలో నల్లగొండ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డిని ఉత్తమ అధ్యక్షుడిగా ఎంపిక చేశారు. జనవరి 29న న్యూఢిల్లీలో జరిగే కార్యక్రమంలో అవార్డును స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా డీసీసీబీ చైర్మన్ మాట్లాడుతూ.. ఈ అవార్డు వచ్చేందుకు సహకరించిన బ్యాంక్ వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులు, పీఏసీఎస్ అధ్యక్షులు, బ్యాంక్ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.


డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

## నిరంతరం జనం మధ్యే ఉంటా

- మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి


సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు

చౌటుప్పల్, డిసెంబర్17 : ప్రజా సమస్యలపై తగ్గేదే లేదని, నిరంతరం ప్రజల మధ్యే ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని బాలాజీ గార్డెన్స్‌లో నిర్వహించిన చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం మండలాల బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపు, ఓటములు సహజమని, ప్రజా తీర్పును గౌరవిస్తానన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు అధైర్య పడొద్దని సూచించారు. ఈ సందర్భంగా గెలిచిన ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. గతంలో మంజూరైన నిధులు రూ.570 కోట్లను ఖర్చు చేసి ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేయాలని కోరారు. నియోజకవర్గంలో పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీరు అందించాలని సూచించారు. ఇందుకోసం తనవంతు సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. లేనిచో సమస్యలపై పోరాడేందుకు సిద్ధంగా ఉన్నానని అన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపును ఎవరూ ఆపలేరన్నారు. ఓటమికి కారణాలు విశ్లేషించుకొని ముందుకు సాగుతామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతి, జడ్పీటీసీ వీరమళ్ల భానుమతీవెంకటేశం గౌడ్, సింగిల్‌విండో చైర్మన్లు చింతల దామోదర్ రెడ్డి, జక్కిడి జంగారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు గిర్కటి నిరంజన్‌గౌడ్, కత్తుల లక్ష్మయ్య, మున్సిపాలిటీ అధ్యక్షుడు ముత్యాల ప్రభాకర్‌రెడ్డి, ఎండీ బాబాషరీఫ్, బొడ్డు శ్రీనివాస్‌రెడ్డి, గుండెబోయిన ఆయోధ్యయాదవ్, ముప్పిడి శ్రీనివాస్‌గౌడ్, కొత్త పర్వతాలుయాదవ్, ఢిల్లీ మాధవరెడ్డి, గుండెబోయిన వెంకటేశ్‌యాదవ్, కానుగుల వెంకటయ్య, ఆల్మాస్‌పేట కృష్ణయ్య పాల్గొన్నారు.